కంకర గుమ్మి ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం కొర్లాం గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న కంకర గుమ్మిని కొంత మంది ఆక్రమణలు చేసి నిర్మాణాలు కూడా చేపడుతున్నారని వెంటనే అటువంటి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కొర్లాం గ్రామస్తులు సోంపేట తహశీల్దార్ అప్పలస్వామికి మంగళవారం ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే రహదారి పక్కనే ఉన్న కొంత మంది ఇండ్ల స్థలాలకు సంబంధిత అధికారులు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని అన్నారు. అటువంటి వారంతా జాతీయ రహదారి పక్కనే నివాసం ఉంటూ వెనుకనే ఉన్న గుమ్మిని ఆక్రమించి కొత్తగా నిర్మా ణాలు చేపడుతున్నారని పేర్కొ న్నారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సర్వే జరిపించి ఆక్రమణలు తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో సోమేశ్వరరావు, జోగారావు, ఆర్.గణపతి, తదితరులు ఉన్నారు.

అరసవల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

- రహదారులు, కాలువల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ సూర్యనారాయణ స్వామి కొలువైన అరసవల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అరసవల్లిలో మౌళిక సౌకర్యాల కల్పనకి పెద్దపీట వేస్తామన్నారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఎమ్మెల్యే శంకర్ మంగళవారం అరసవల్లి పరిసర ప్రాంతాలలో పర్యటించారు. నగరంలోని ఖాజీపేట, అరసవల్లిలోని హరిజనవీది, కొయ్యాన కన్నయ్యకాలనీ, ఆదిత్యనగర్, బొంపాడ వీది తదితర ప్రాంతాలలలో ఎమ్మెల్యే కలియ తిరిగారు. స్థానికులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి రోడ్లు, డ్రైనేజీలు, ట్రాఫిక్ సమస్యలను తీసుకువెళ్ళారు. హరిజనవీది వాసులు దళితుల స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు. అయితే ఇప్పటికే ఏఐఎమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను స్మశాన వాటిక అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్లను వివిద సందర్భాలలో కలుసుకుని వినతిపత్రాన్ని ఇచ్చిన విషయాన్ని కమిషనర్ ఓబులేసు ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకువెళ్ళారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దళితుల స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ, స్వర్గదామం నిర్మాణం, బోర్ వంటి మౌళిక సౌకర్యాల కల్పన కోసం అంచనాలు రూపొందించామని త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టడం జరుగుతుందని కమిషనర్ వివరించారు. అరసవల్లికి వచ్చే భక్తుల సంఖ్య పెరగడం వల్ల ఆదివారాలు, అలాగే ఉత్సవాలు జరిగే రోజులలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యేకి తెలియజేసారు. అరసవల్లిలోని అసిరితల్లి ఆలయం ఎదురుగా ఉన్న లక్ష్మీనగర్ కాలనీ, ఆదిత్యనగర్ కాలనీలను అనుసందానం చేసేలా రహదారిని ఏర్పాటు చేస్తే ఆ మార్గంలో గర్ల్స్ హై స్కూల్ వరకూ వెళ్ళే చాన్స్ ఉంటుందని ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఆయన వెంటనే కమిషనర్ ఇతర కార్పొరేషన్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గెడ్డ మీద వంతెన నిర్మిస్తే రాకపోకలకు మార్గం సుగుమమవుతుందని గుర్తించి ఆ మేరకు ప్రతిపాదనలు సిద్దం చేసి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడులు అరసవల్లిని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఉన్నారని, ఇంద్రపుష్కరిణి కూడా బాగు చేయాలని వారు అనుకుంటున్నారని వారి దృష్టికి తీసుకువెళ్ళి ప్రణాళికాబద్దంగా అరసవల్లిని అభివృద్ధి చేసే చర్యలు తీసుకుంటానని శంకర్ హామినిచ్చారు. అరసవల్లిలో రహదారులు, డ్రైనేజీలు ఇతరత్ర మౌళిక సౌకర్యాలను అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఉంగటీ వెంకటరమణ, రాయిపిల్లి అర్జున్, తెలుగు నాగరత్నం, తెలుగు తాతబాబు, తెలుగు సుధీర్, అరసవల్లి గ్రామ ప్రజలు ఖైరి రామకృష్ణ, రుప్ప లక్ష్మణ్, పంకు మురళి, సీడి పవన్, ముద్దాడ జయంత్, దుప్పాడ ఆశిష్, జామాన. అరుణ కుమారి, జామాన ఉదయ్ కుమార్, కింజరాపు రామకృష్ణ, కళ్లేపల్లి ఆది, జామాన చాణక్య, సూరిబాబు, బాలు, సిహెచ్.సుశీల, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు విద్యా కమిటీ ఎన్నికలు

26 సమస్యాత్మక గ్రామాలు

విశాలాంధ్ర - కొత్తూరు : ఈ నెల 8వ తేదిన జరగనున్న స్కూల్ మేనేజ్మెంట్ కమిటిల ఎన్నికల్లో మండలంలో 26 గ్రామాల్లో ఎన్నికల్లో సమస్యాత్మక మైనవిగా మండల విద్యాశాఖ అధికారులు గుర్తించారు వీటిల్లో ఏడు ఉన్నత పాఠశాలలు కేజిబివి పాఠశాల మిగిలినవి ప్రాథమిక పాఠశాలలున్నాయి ఆయా సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ బందో బస్తు ఉంటుంది అని విద్యాశాఖ అధికారులు తెలిపారు 8 వ తేదీనే ఉదయం నామినేషన్లు పోటీ.లున్న చోట మధ్యాన్నం ఎన్నికలుంటాయని తెలిపారు.

తహశీల్ధార్‌ను కలిసిన ఉప సర్పంచ్ సాసుపల్లి

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నూతనంగా విధుల్లోకి చేరిన తహశీల్ధార్, టి.సత్యన్నారాయణను మేజర్ పంచాయితీ ఉప సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్బంగా తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందచేసి, నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి గౌరవం పెరిగేలా విధులు నిర్వర్తించాలని, అలాగే మండలంలో పెండింగ్‌లో వున్న పలు భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ ఈవో, ఎస్.చిన్నారావు, టిడిపి ప్రతనిధులు, బోయిన సతీష్, కోరాడ రామచంద్రరావు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ద్వారా ఆరున్నర కోట్లు మంజూరు

డాక్టర్ నిమ్మన దాసు

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలానికి జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా ఆరున్నర కోట్ల రూపాయలు మంజూరు కాబడ్డాయని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన మంగళ వారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా పంచాయతీల గ్రామాల్లో అవసరమైన సీసీ రోడ్లు, డ్రైన్లు మొదలైన పనులకు పంచాయతీ తీర్మానాలు చేసి మండల పరిషత్ కార్యాలయానికి అందజేయాలని కోరారు. ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రతిరోజు జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ఈఓపిఆర్‌డి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ జేఈ కె.రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ కమల్‌వికాస్, ఏపీఓ ప్రమీల, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎంవో సుజాత

విశాలాంధ్ర - జలుమూరు : గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుత తరుణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామస్థాయిలో ఉన్న వైద్య సిబ్బంది ఆరోగ్య ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని జలుమూరు మండలం అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి పి సుజాత అన్నారు. మంగళవారం పిహెచ్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ సిబ్బందికి సూచనలు అందజేశారు. గ్రామాల్లో ప్రతి ఇంటి పరిస్థితులను పరిశీలించి అవసరమైన వైద్య సహాయం అందించాలని సూచించారు. ఆమెతోపాటు ఈవో బామ్మి నాయుడు, హెచ్ వి పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

జీడి రైతు సంఘం నాయకులు డిమాండ్

విశాలాంధ్ర - పలాస : జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి, రైతు సేవా కేంద్రాల ద్వారా 80 కేజీల బస్తా రూ.16 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో జీడి రైతుల సంఘం నాయకులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాద పూర్వకంగా కలిసి జీడి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జీడి పై ఇచ్చిన హామీలను త్వరగా అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పలాస కేంద్రంగా జీడి బోర్డు ఏర్పాటు చేయాలని, బ్యాంకుల ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జీడి రైతాంగానికి అమలు చేయాలని కోరారు. జీడి పిక్కలు కొనుగోలు అనంతరం విదేశీ పిక్కలకు అనుమతించాలని కోరారు. జీడి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో చర్చలు జరిపి కేంద్ర పంటల జాబితాలో జీడి పంటను చేర్పించుటకు కృషి చేయాలని కోరారు. దీని పై ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందిస్తూ జీడి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేస్తున్న వారిలో జీడి రైతు సంఘం నాయకులు కుత్తుం వినోద్ కుమార్, నెయ్యల గణపతి, కోనేరు రమేష్, తమ్మినాన భాస్కర్, మద్దు రాఘవరావు, సూరాడ మోహనరావు, అంబటి రామకృష్ణ, బత్తిని లక్ష్మీనారాయణ, ఎంపల్ల జోగారావు, బిఆర్‌కె నాయుడు, దాసరి తాతారావు,దాసరి మోహనరావు, పుక్కళ్ల తాతారావు, అర్లి దానేషు, జినీలకంఠం, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి

గొలివి ఆసుపత్రుల ఛైర్మన్ డా.గొలివి మోహన్

విశాలాంధ్ర - నరసన్నపేట : రాష్ట్రంలో జరుగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని గొలివి ఆసుపత్రుల ఛైర్మన్, డా.గొలివి మోహన్ అన్నారు. మంగళ వారం స్థానిక శ్రీ జ్ఞానోజ్యోతి డిగ్రీ కళాశాలలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై చర్యలు-నియంత్రణ అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కొన్న శ్రీనివాసరావు అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా.గొలివి మోహన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మత్తు పధార్ధాలు సేవించటం వలన విద్యార్థులు జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. గంజాయి సేవించటం వలన అనేక రకాలైన అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని, శరీరంలో వున్న అన్ని అవయవాలన్నీ దెబ్బతింటాయాని అన్నారు. మత్తు పధార్థాలు నియంత్రణలో విద్యార్థులే కీలకపాత్ర పోషించి, ప్రజలను చైతన్యవంతం చేయాలని డా.మోహన్ తెలిపారు. అనంతరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సిఐ, సతీష్‌కుమార్, ఏఎస్ఐ, అసిరినాయుడు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు చాక్లెట్లు, తినుబండారాలు రూపంలో మత్తు పదా ర్థాలను కళాశాలల కేంద్రంగా ఇస్తున్నారని, అలాంటి వారు ఎవరైనా వుంటే వారి వివరాలను పోలీసులకు తెలియ చేయాలని అన్నారు. అలాగే ఎం.ఈ.వో, యు.శాంతారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎం.యుగంధర్, జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రవీణ మాట్లాడుతూ హెరాయిన్, కోకాయిన్, గంజాయి లాంటి ప్రమాదకరమైన మత్తు పధార్థాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని తెలిపారు. విద్యార్థులు వారి తల్లితండ్రుల మాటలు విని, మంచి ప్రవర్తనతో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ప్రతినిధులు, రాజు, రాము, జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నీ పరిశోధన కేంద్రంపై ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరా

రూ.11 కోట్ల విలువైన పరికరాలు అవసరం

విశాలాంధ్ర - పలాస : పలాసలో కిడ్నీ ఆసుపత్రి మరియు పరిశోధన కేంద్రం ప్రారంభమైన అది డయాలసిస్ కేంద్రంగా పని చేస్తుందా? లేక పరిశోధన కేంద్రంగా పని చేస్తుందా.. అని అధికారుల నుంచి ఎమ్మెల్యే గౌతు శిరీష ఆరా తీశారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమెను ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిర్మాణానికి రూ.53 కోట్లు మంజూర య్యాయని, రూ.25 కోట్ల విలువైన అధునాతన సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, కేవలం రూ.14 కోట్ల పరికరాలు మాత్రమే గత ప్రభుత్వం అందించిందని వివరించారు. పూర్తి స్థాయిలో కిడ్నీ పరిశోధన కేంద్రానికి కావలసిన పరికరాలు అక్కడ లేవని వివరించారు. 2014-2019 వరకు ఉన్న ప్రభుత్వానికి ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కిడ్నీ పరిశోధన కేంద్రంను నెలకొల్పాలని సిఫారసు చేశారని, అందుకు అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు స్పందించి, పలాసలో నిర్మాణం చేపట్టేందుకు భూ సమీకరణ చేపట్టి.. శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. అయితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ నిర్మాణం మాత్రమే చేపట్టి... అభివృద్ధి చేశామని ప్రచారం చేసుకున్నారే తప్ప అవసరమైన మేరకు పరికరాలు లేకుండానే అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డితో ఆదరాబాదరగా ప్రారంభోత్సవాలు చేపట్టారని విస్మయం వ్యక్తం చేశారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కలసిన వారిలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సత్యప్రభాకర్, డీఈఈ త్రిమూర్తులు, జేఈలు నరేంద్ర, ధనుంజయ, సాయిసురేంద్ర, బీఎంఈ దామోదరరావు, తదితరులున్నారు.

నాణ్యమైన విద్యాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు : ఎమ్మెల్యే అశోక్

విశాలాంధ్ర - సోంపేట : విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి సహాయపడే రాష్ట్ర ప్రభుత్వం ఇతోదికంగా కృషి చేస్తోందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం సోంపేటలో ఏపీ మోడల్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్మీడియెట్ విద్య ఎంతో కీలకమైనదని అన్నారు. ఈ దశలో విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో ఉత్తమమైన ఫలితాలు సాధించేందుకు ప్రయత్నించాలని అన్నారు. ఇంటర్ తర్వాత విద్యార్థి భవిష్యత్తు ఇంజనీర్‌గాను, డాక్టర్లుగాను నిర్ణయించేది ఇక్కడేనని అన్నారు. ఇటువంటి విద్య పట్ల ప్రతి ఒక్కరు అంకితభావంతో, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా చదువులు పూర్తి చేయాలని, ఉన్నతమైన భవిష్యత్తు కోసం తగురీతిలో ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.మోహనరావు, పి.రజనీకుమారి, కూటమి నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శేఖర్, బీన వంశీ, మద్దిల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే దిశా నిర్దేశం చేసుకోవాలి

శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర - కవిటి : విద్యార్థి దశలోనే విద్యార్థులు దిశా నిర్దేశం చేసుకోవాలని ఇచ్ఛాపురం నియోజక వర్గం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను ఎమ్మెల్యే అశోక్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధతో వుందని, విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ పుస్తకం పవిత్రమైనదని, అటువంటి పవిత్రమైన కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, బెందాళం తిరుమల కుమార్, బెందాళం కామరాజు, బి.సురేష్, జి.రామారావు, వజ్జ రంగా రావు, ప్రగడ మణిబాబు, కోళ్ల ముకుందరావు, భావన రవికుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జర్నలిస్టులకు కేంద్రమంత్రి తేనేటి విందు

విశాలాంధ్ర - పలాస : హర్యానా రాష్ట్ర రాజధాని చండిఘర్ సమీపం పంచకుల లో జరిగిన ఐజేయూ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో ఢిల్లీ చేరుకున్న ఉత్తరాంధ్ర ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన కార్యాలయంలో మంగళవారం తేనేటి విందు ఏర్పాటు చేసి, రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు, ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని అయన కార్యాలయంలో కలిసిన ఉత్తరాంధ్ర ఏపీయూడబ్ల్యూజే నాయకుల బృందం శుభాకాంక్షలు తెలియజేసారు. కేంద్ర మంత్రిను కలిసిన వారిలో ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ ఈశ్వరరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రామచంద్రరావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, పాయకరావు పేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆచంట రామకృష్ణ, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవి మల్లేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా సీనియర్ నాయకులు జీవి నాగభూషణ్ ఉన్నారు. ఈ ఆత్మీయ కలయిక సమావేశానికి సహకరించిన పూర్వ పాత్రికేయుడు, కింజరాపు కుటుంబ ఆత్మీయుడు, మిత్రుడు నౌపడ సత్యనారాయణకు ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ నాయకుల బృందం ధన్యవాదాలు తెలిపారు.

నివగాంలో పారిశుధ్య పనుల పరిశీలించిన ఈఓపీఆర్డీ

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం నివగాం పంచాయతీలో నిర్వహిస్తున్న పారి శుధ్య పనులను ఇవోపిఆర్డి బి.వి.ఏస్ ప్రసాద్ రావు మంగళవారం పరిశీలించారు. రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని సచివాలయ గ్రామ కార్యదర్శికి సూచనలు చేశారు. తరుచూ కాలువల్లో బ్లీచింగ్ చేయాలని అన్నారు.

ఆదివాసి పోరాట సభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - పలాస : హైదరాబాదులో ఈనెల 9,10 తేదీలలో జరుగుతున్న ఆదివాసి హక్కుల పోరాట సంరక్షణ వేదిక సదస్సులను జయప్రదం చేయాలని పలు విప్లవ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆవిష్కరణ లో పౌర హక్కుల సంఘం దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం ప్రజా కళామండలి, అమరుల బంధుమిత్రుల సంఘం పిడిఎస్ యు విద్యార్థి సంఘం, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, ప్రజాస్వాదుకవాదులు పాల్గొన్నారు. గత దశాబ్ద కాలం మధ్య భారతంలో ముఖ్యంగా చత్తీస్ ఘడ్ మారణ హెూమం విధ్వంసం, ఆదివాసి హక్కుల ఉల్లంఘన పై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పౌర సమాజం మాట్లాడాలని కగార్ ఆపరేషన్ నిలుపుదల చేయాలని అక్కడ శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

పెండింగ్ లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు మెస్ చార్జీలు విడుదల చేయాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కొనసాగించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించి, సరైన మౌలిక వసతులు కల్పించి, పెండింగ్ మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు వెంటనే విడుదల చేసి విద్యార్థి రంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా పిలుపు లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. రవి మాట్లాడుతూ కొన్ని శతాబ్దాల కాలం నుంచి ఉంటున్న ప్రభుత్వ హాస్టల్‌లు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని, తక్షణమే వాటికి సొంత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రాణాలు కాపాడాలన్నారు. హాస్టల్లో మరమ్మత్తుల కోసం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు అద్దె భవనాల్లో కాకుండా రాష్ట్ర ప్రభుత్వం సొంతభవనాలు నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టల్స్ ఖాళీగా ఉన్న వార్డెన్ కుక్ అటెండర్ కామాటి పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కొనసాగించి విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఉన్నత చదువులకు దూరం చేసే విధంగా ఉన్న జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలు పాఠశాల జూనియర్ డిగ్రీ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్స్ జూనియర్ కళాశాల కేజీబీవీ మోడల్ స్కూల్ విద్యార్థుల సమస్యలు గుర్తించామని ఆ సమస్యల పరిష్కారం కోసమే ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమంలో నిర్వహించడం జరిగిందని, సమస్యలు పరిష్కారం కాకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్,జీవన్, అఖిల్, కుమార్, అనిల్ జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ పంట నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

తహశీల్దార్ హనుమంతరావు

విశాలాంధ్ర - మెలియాపుట్టి : ఖరీఫ్ 2024 సంవత్సరంలో వివిధ పంటల పండించే ప్రతి ఒక్క రైతు ఈక్రాప్ పంటను నమోదు చేయించుకోవాలని తహసిల్దార్ హనుమంతరావు అన్నారు. గ్రామ రెవె న్యూధికారులు, గ్రామ వ్యవసాయ సహా యకులకు ఈక్రాప్ పంట నమోదు ప్రక్రియ పై స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం నాడు వ్యవసాయ అధికారి దానకర్ణుడు ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈక్రాప్ పంట నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు గ్రామస్థాయిలో వీఆర్వోలకు, గ్రామ వ్యవసాయ సహాయ కులుకు సహకరించి ఈక్రాప్ పంట ప్రక్రియ సెప్టెంబర్ 15వ తేదీ లోగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ క్రప్ నమోదు ప్రక్రియకు సంబంధించి చేపట్ట వలసిన వివిధ అంశాలపై సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తోపాటు మండల వ్యవసాయధికారి దానకర్ణుడు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బంది తదితరులున్నారు.

1/70 చట్టం అమలు చేయాలి : ఏఐకెఎమ్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు

విశాలాంధ్ర - మెలియాపుట్టి : జిల్లాలో ఆదివాసి గ్రామాలు 5వ షెడ్యూల్లో చేర్చబడలేదని దశాబ్దాల కాలంగా అఖిల భారత రైతుకూలీ సంఘం, విప్లవ పార్టీల నాయకత్వంలో ఆదివాసి సంఘాలు 5వ షెడ్యూల్ సాధన కొరకు అవిరామంగా పోరాడుతున్నాయని, ఆదివాసి గ్రామాలన్ని అయిదవ షెడ్యూల్లో చేర్చి 1/70 చట్టాన్ని అమలు చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు అన్నారు. మెలియాపుట్టి మండలం, రింపి గ్రామంలో మంగళ వారం నాడు 9వ తేదీన జరగబోయే అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అడవులను రక్షించుకునే క్రమంలో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి పోరాడాలని మాధవరావు పిలుపునిచ్చారు. అంతులేని లాభాపేక్షతో కార్పొరేటర్లకు అడవులు కట్టబెట్టడానికి కుట్రలు చేస్తున్నారని, కార్పొరేటర్ల లాభాల కోసమే అటవీ సంరక్షణ నియమాలు, చట్టాలు తెచ్చారని అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి అనుకూలంగా చట్టాలను తీసుకొస్తున్నారని దీంట్లో భాగంగానే 2023 అటవీ నియమాల, సంరక్షణ చట్టాన్ని తీసుకువచ్చారని దుయ్యబట్టారు. మితిమీరిన లాభాల కోసం అడవుల్లో దొరుకుతున్న ఖనిజాల కోసం ఆదివాసీల పైన నిరంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దాడులు చేస్తున్నాయని మోడీ అధికారంలోకి వచ్చాక ఆదాని, అంబానీలకు అడవులను కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం భారత అటవీ సంరక్షణ చట్టం 1980 సవరించి ఆదివాసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. కొమరం భీమ్, బీర్సాముండ, అల్లూరి సీతారామరాజు వంటి ఆదివాసీ నాయకులు, అంబేద్కర్ వంటి నాయకుల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. మెలియపుట్టి కేంద్రంగా ఐటీడీఏ సాధన కొరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసి గ్రామాలకు రహదారుల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ఒక తంతులాగా మార్చారని ఐక్యరాజ్య సమితి ఆదివాసుల హక్కులు, సమస్యలు ఆయా దేశాలు గుర్తించి పరిష్కారాన్ని కృషి చేయాలని పిలుపునిస్తే దానికి భిన్నంగా భారతదేశంలో జరుగుతుందని విమర్శించారు. అనంతరం జరిగిన ర్యాలీలో స్థానిక సర్పంచ్ గౌరిష్, పిఓడబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి ప్రభ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు సవర శ్రీను, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భాస్కరరావు, లక్ష్మణ్, పోలయ్య, రామారావు, వెంకట్రావు, శేఖర్, గ్రామస్తులు తదితరులున్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1.83 లక్షలు

విశాలాంధ్ర - టెక్కలి : మండల పరిధిలో ఉన్న రావివలస గ్రామంలో వెలిసిన శ్రీ ఎండల మల్లికార్జున స్వామి దేవస్థానం హుండీ ఆదాయం 151 రోజులకు రూ.1,83,252 వచ్చినట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ ఆవరణంలో స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ లెక్కింపులో ఆమదాలవలస దేవాలయశాఖ ఈవో టి.రవి హుండీ తెరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బడె జగదీష్, టెక్కలి దేవాదాయశాఖ సిబ్బంది గోవింద్, శివ, ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు.

చిన్నారి వైద్యానికి ఎస్జీఎఫ్ సభ్యుల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కవిటి : కంచిలి మండలం కర్తలి గ్రామానికి చెందిన తాతయ్య,ధనలక్ష్మి దంపతుల కుమారుడు హృషికేష్ ఆట పాటలతో అలరించల్సిన వయస్సులో క్యాన్సర్ వ్యాధి గురయ్యాడు. అందుకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అయితే నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో వుండడంతో గ్రామ యువత ఎస్జితఎఫ్ సంస్థ దృష్టికి తీసుకురావడం జరిగింది. విశాఖపట్నంలో గల మెడికవర్ హాస్పిటల్‌లో ఉన్న బాబును ఎస్జిఎఫ్ సభ్యుల బృందం పరామర్శించి కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాబు వైద్య ఖర్చుల నిమిత్తం లక్షా పదిహేను వేల రూపా యలు హృషికేష్ కుటుంబానికి అందజేశారు. మరింత మంది దాతలు ఆర్థికంగా బాబు హృషికేష్ ఆదుకోవాలని ఎస్జిఎఫ్ సభ్యులు కోరారు. బాబు వైద్యం కోసం విరాళాలు సేకరించడంలో ఎస్ జి ఎఫ్ మహిళ విభాగం ముఖ్య సభ్యులు ఢిల్లేశ్వరి వారి స్నేహితులు కీలక పాత్ర వహించారు. అందరి చల్లని దీవెనలతో హృషికేష్ త్వరగా కోలుకుని క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని ఎస్జిఎఫ్ కోరారు.

దళితునిపై దాడి చేసిన వారిమీద అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలి

డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి

విశాలాంధ్ర - సారవకోట : మండలంలోని కొమ్ము సరియపల్లి గ్రామం బెండి గురవయ్య అనే దళిత రైతు మీద దాడి చేసిన ఆ గ్రామ అగ్రకుల వ్యక్తి మీద అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి డిమాండ్ చేశారు. ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న దళిత రైతును మంగళవారం గోపి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని కబ్జా చెయ్యాలనే ఉద్దేశంతో అగ్రకుల అహంకారంతో పొలం వద్ద పార తో దళితుని మీద దాడి చేయడం దుర్మార్గం అన్నారు. ఈ విషయం మీద పోలీస్‌లకు పిర్యాదు చేసిన ఇప్పటి వరకు కేసు నమోదు చెయ్యకుండా కాలయాపన చెయ్యడం భావ్యం కాదని, వెంటనే దాడి చేసిన వారి మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతని వెంట డిహెచ్‌పిఎస్ టెక్కలి మండల అధ్యక్షులు టి.ధర్మారావు తదితరులు ఉన్నారు.

రైతులకు మౌలిక సదుపాయాలు అందించాలి : బీజేపీ కిసాన్ మోర్చా

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రైతులకు మౌలిక సదుపాయాలు అందించాలి అని బిజెపి కిసాన్ మోర్చా శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు మంగళవారం ఉదయం మెమోరాండం అందజేశారు. గత ఐదేళ్లుగా రైతులు పూర్తిగా అన్ని విధాల నష్టపోయారని, సాగు నీరు అందని పరిస్థితి, మేలైన విత్తనాలు ఇవ్వని పరిస్థితి, ప్రకృతి వైపరిత్యాలు సంభవిస్తే, పంట నష్టపరిహారం చెల్లించని దయనీయ పరిస్థితిని రైతాంగం అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి నుండి వారికి కూటమి ప్రభుత్వంలో విముక్తి లభించాలని భావిస్తూ.. వారికి మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇటీవల పడిన బారీ వర్షాలు కారణంగా పంట నష్టం లెక్కించి రైతు ఖాతాలకు జమ చేయాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో సాగునీటి కాలువలు పూడిక తీయంచడం, రెండు లక్షల ఎకరాలకు నీరు యదేచ్ఛగా వెళ్ళే మార్గం సుగమం చేశారని తెలిపారు. ఎరువులు, మేలైన విత్తనాలు కొరత లేకుండా చూడాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీపాన కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరుకోల రామారావు, కిల్లి లక్ష్మణరావు, నడుపూరు లక్ష్మీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పాడ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగంపై వినతి

విశాలాంధ్ర - టెక్కలి : మండల పరిధిలో ఉన్న పలు పంచాయతీలలో గ్రామాల నిధులు దుర్వినియోగం చేశారంటూ బిజెపి నాయకులు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మీకోసం కార్యక్రమంలో ఉన్నతాధికారులకు వినతిని అందించారు. గత మూడు సంవత్సరల కాలంలో పాతగా నిర్మించి ఉన్నటువంటి సీసీ రోడ్లు మీద కొత్తగా రోడ్లు నిర్మించినట్లు చూపిస్తూ పంచాయతీ సెక్రటరీ తో కలిసి గ్రామ పెద్దలు బిల్లులు చేసుకున్నారని తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటా కుళాయిలు అంతంత మాత్రమే వేసి బిల్లులు చెల్లించుకున్నారని, ప్రధానమంత్రి ఆవాస్ యువజన కింద ఇచ్చినటువంటి కాలనీలలో స్థానికులకు ప్రభుత్వ స్థలాలు కేటాయించకుండా బయట వాళ్లకి ఇల్లు పట్టాల మంజూరు చేసి స్థానికులకు అన్యాయం చేశారని అన్నారు. గ్రామాలలో స్మశాన వాటికలు, చెరువులను ఆక్రమించుకొని సాగు భూమి గా అమల్లోకి తెచ్చారని, పోరంపోగు స్థలాలను కూడా ఆక్రమించుకున్నారని వివరించారు. ఇలా పంచాయతీ, గ్రామాల నిధులను దుర్వినియోగం చేశారని, అలాంటి వారిపై విచారణ జరిపించి ప్రజల నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడాలని అధికారులకు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మోర్చ జిల్లా అధ్యక్షులు జన్ని పరమేశ్వరరావు, బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకురాలు సవ్వాన ఉమామహేశ్వరి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగి లక్ష్మి, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు కె మనమ్మ పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని వివిధ సమస్యలతో వచ్చేవారికి పరిష్కారం చూపే దిశగా పనిచేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మునసబు పేటలోని ప్రయివేటు కళ్యాణ మండపంలో మంగళవారం మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు, మండల, గ్రామస్థాయి బిజెపి, జనసేన, టిడిపి నాయకులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పంచాయతీ నిధులను కైంకర్యం చేయడంతో గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువైందని చెప్పారు. వైసిపి పాలనలో ప్రజలు మరో ముప్పై ఏళ్లు వెనక్కి వెళ్ళిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచినీటి, కాలువలు, విద్యుత్తు వంటి కనీసం మౌలిక సదుపాయాలను కూడా అందజేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తిస్థాయి దిష్టి సారించామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో అపరిశుభ్ర నిర్మూలనకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టినట్లు వివరించారు. అడపాదడప్ప వర్షాలు పడుతున్నాడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కావున అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఐదేళ్లుగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ప్రజాసేవలో అంకితం కావాలని చెప్పారు. ఏ గ్రామానికి వెళ్లిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల అవసరాలను గుర్తించి వాటిని ప్రాధాన్యతంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు, మండల, గ్రామస్థాయి బిజెపి, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మద్యం షాపు కేటాయింపులలో రిజర్వేషన్ కల్పించాలి

విశాలాంధ్ర - టెక్కలి : గౌడ, శెట్టి బలిజ, ఈడిగ సామాజిక వారికి కొత్త మద్యం దుకాణాల పాలసీలో 15శాతం రిజర్వేషన్ కల్పించినున్నట్లు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో సోమవారం జరిగిన కలెక్టర్ సమావేశంలో ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు టెక్కలి సొండికుల ప్రధాన కార్యదర్శి జి నాగభూషణం మంగళవారం ప్రకటనలో తెలిపారు. కులవృత్తి కోల్పోయిన సొండి కులస్తులకు నూతన అబ్కారి విధానంలో మద్యం షాపులు కేటాయింపులలో 10శాతం రిజర్వేషన్ కల్పించాలని టెక్కలి సొండికుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.నాగభూషణం కోరారు. తమ కులవృత్తి ప్రభుత్వం తీసుకున్న తర్వాత వృత్తిపరంగా ఎలాంటి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేక నానా దుర్భరమైన జీవితాలను గడుపుతున్నట్లు తెలిపారు. తమ కులం లక్ష జనాభా కలిగి ఉన్నప్పటికీ గత ప్రభుత్వంచే కుల వివక్షతకు గురైనట్లు, రాజకీయంగా ఆర్థికంగా భాషాపరంగా చాలా వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వర్యులు, అప్పటి ప్రతిపక్ష నాయకులు నారా చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్ర ఎలక్షన్స్ పర్యటనలో భాగంగా పార్వతీపురం బహిరంగ సభలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గౌడ కులస్తులు మాదిరిగా సొండి కులస్తులకు న్యాయం చేసి మద్యం దుకాణాలలో రిజర్వేషన్స్ కల్పించనున్నట్లు హామీ ఇవ్వడం జరిగినదని పత్రికా ముఖంగా గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న నూతన అబ్కారీ విధానంలో సొండి కులస్తులకు మద్యం దుకాణాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

ఐతంలో నూతన పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో బిఎస్ అండ్ హెచ్ విభాగంలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మామిడి పాపినాయుడు, వెలగల రాంబాబు, మోదుల వలస కృష్ణ ప్రసాద్, నడిమింటి శైలజలు నూతనంగా రచించిన ఏడ బుల్ విజన్ ఇన్ జంఫ్ లహరిస్ వర్ప్ అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకం ఆవశ్యకతను వివరిస్తూ విదేశాలకు వలస వెళ్లే వారు పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న జాతి వివక్షత వంటి అంశాలపై జంఫా లహరి నవల ఆధారంగా అధ్యాయనం చేసే రచయితలు ఈ పుస్తకాన్ని రచించారన్నారు. ఇండియన్ డియోస్పోరిక్ విభాగంలో పీహెచ్డీ చేసే స్కాలర్లకు, హనుమాన్ సాహిత్యం చదివే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని డైరెక్టర్ తెలిపారు. ఈ పుస్తక ఆవిష్కరణలో డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు తోపాటు ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వేణుగోపాల్, బిఎస్ అండ్ హెచ్చెచ్ ఓడిలు డాక్టర్ ఎం రమణయ్య, డాక్టర్ ఎంవి రత్నమని రచయితలు పాల్గొన్నారు.

స్వదేశి మత్స్యకారులు బలోపేతం కావాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : చేపల పెంపకం ఆధారంగా జీవించే స్వదేశీ మత్స్యకారులు వృద్ధిలోకి రావాలని మత్స్యశాఖ సహాయ సంచాలకులు వై. సత్యన్నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక కంద్రవీధిలో స్వదేశి మత్స్యకారులతో సమావేశమై ఫిష్ ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ఏర్పాటుతో అందరు స్వదేశీ మత్స్యకారులను ఐక్యం చేసి వారి ఉన్నతికి కృషి జరుగుతుందని తెలిపి ఆర్గనైజేషన్ విధి విధానాలను వివరించారు. చేప పిల్లలను చెఱువులో విడుదల చేయాల్సిన సమయం అని, అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పక పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సి.హెచ్. బాలక్రిష్ణ అన్నారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారితో పాటు స్థానిక స్వదేశీ మత్స్యకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి మూడో విడత నోటిఫికేషన్ విడుదలైనట్టు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎల్.సుధాకరరావు తెలిపారు. అభ్యర్థులు ఆన్లైన్లో ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ నందు తమ వివరాలను ఈ నెల 26వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఏ ఐటీఐలో చేరాలనుకు టున్నారో ఆ ఐటీఐలకు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసి.. ఆ ఫారంతో పాటు ఒరిజనల్ సర్టిఫికేట్లతో సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 27వ తేదీలోగా పరిశీలన జరిపించుకోవాలన్నారు. ఏ ఐటీఐకు దరఖాస్తు చేశారో ఆ ఐటీఐలో ఈ నెల 29వ తేదీన ఉదయం 9 గంటలకు జరిగే కౌన్సెలింగ్కు హాజరు కావాలన్నారు.

కాకినాడ ఆదిత్యలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళాడిగ్రీ కళాశాలలో జిల్లా రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో డ్రగ్స్ మరియు టొబాకో వంటి మాదక ద్రవ్యాలు వలన కలిగే దుష్ప్రభావాలు కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వర రావు మాట్లాడుతూ నేటి యువత డ్రగ్స్ బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని, భవిష్యత్ ను కాపాడు కోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు కూడా ఇలాంటి వాటికీ దూరంగా ఉండి మనకు ఎంతో కష్టపడి చదివిస్తున్న మన తల్లిదండ్రుల కళలను సాకారం చేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ యువత చెడు అలవాటులకు దూరంగా ఉంటూ జీవిత గమ్యం ను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు,రెడ్ క్రాస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ గొలివి రమణ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

నూతన అటవీ సంరక్షణ చట్టం 2023ను రద్దుకై ఉద్యమిద్దాం

ఏఐకేయంయస్, ఏఐటీఎఫ్ జిల్లా కమిటీల ఉమ్మడి పిలుపు

విశాలాంధ్ర - మందస : ఆదివాసీ రక్షణ చట్టాలను రద్దుచేసి, ఆదివాసీలను అడవి నుండి తరిమి వేసి, అడవినీ అటవీ సంపదనూ కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆదివాసీ వ్యతిరేక నూతన అటవీ సంరక్షణ చట్టం 2023ను రద్దు చేయాలని లేకుంటే ఉద్యమిద్దామని ఏఐకేఎంఎస్, ఏఐపీఎఫ్ జిల్లా నాయకులు అన్నారు. ప్రపంచ ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినం సందర్భంగా వారం రోజుల పాటు జిల్లా ఆదివాసి గ్రామాల్లో ప్రచార ఉద్యమాన్ని సాగిద్దామని జిల్లా కమిటీల నాయకులు ఉమ్మడిగా పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా మంగళవారం మందస మండలం కొండలోగాం ఆదివాసీ గ్రామంలో ప్రచార ఉద్యమాన్ని నిర్వహించారు. ఏఐకేయంయస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, ఆదివాసీ నాయకులు సవర పున్నయ్య, సవర సంతోష్ సవర రామయ్య, సవర రామారావు , పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పీవైయల్ జిల్లా కన్వీనర్ సార జగన్ , ఆదివాసీ బిడ్డలు సమర సీతమ్మ, సవర చంద్రమ్మ, సుభద్ర, కుమార్, ఢిల్లమ్మ, పెద్ద సీత తదితరులు పాల్గొని మాట్లాడారు. నేటి ఆదివాసి యువత, ఆదివాసి జనతా మేల్కోవాల్సిన చారిత్రక సందర్భమిదేననీ అమరులు సాధించిన ఆదివాసీ హక్కులు,చట్టాలు..పాలకుల హరణకు గురైతే... ఆదివాసి సమాజానికి ఎంత నష్టమో తెలుసుకొని పోరాడాలన్నారు. హక్కులు, ఆదివాసీ రక్షణ చట్టాలు లేకుండా ఆదివాసీలు జీవించడం ఎంత కష్టమో గమనించి పోరుబాటలో నడవాలని పిలుపునిచ్చారు. జల్, జంగల్ , జమీన్ (నీరు, అడవి, భూమి)రక్షణ కోసం 'మా ఊళ్లో మా రాజ్యం' అని నినదించి ఉద్యమించాలన్నారు. ఆదివాసీల కోసం చరిత్రలో తిరుగుబాట్లు పోరాటాలు చేసి తమ విలువైన ప్రాణాలను అర్పించిన ఆదివాసీ వీరులు కొమరం భీమ్ , రాంజీగోండ్, బిర్సాముండా, సోయం గంగులు, కొర్రా మల్లయ్య, కుంజా ముత్యాలు, అల్లూరి, కోరన్న, మంగన్న, ఆదివాసీలతో మమేకమై వారితోనే తమ జీవితాలను త్యాగం చేసిన కుమారన్న, జయక్క సీతారాముల వంటి అమరులు అందించిన పోరాట వారసత్వం, పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఉద్యమ బాటను పట్టాలన్నారు.ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినం సందర్భంగా మరింత పోరాట దీక్షను పూనుతూ కేంద్రంలోని ఫాసెస్ట్ బీజేపీ ప్రభుత్వం సవరణల పేరుతో తీసుకుని వచ్చిన ఆదివాసీలకు ద్రోహం చేసే చట్టానికి వ్యతిరేకంగా నిరసన సభలు, సమావేశాలు, ర్యాలీలను నిర్వహించవలసిందిగా పిలుపునిచ్చారు.

9న అప్రంటీస్ మేళా

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9న అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు మం గళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరబిందో (పైడిభీమవరం)లో అప్రంటీస్ కోసం ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రికల్ ట్రేడులో ఉత్తీర లైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్య ర్థులు రెండు జతల బయోడేటా, పదోతరగతి, ఐటీఐ సర్టిఫికేట్లు, ఆధార్ కార్డుతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

కురుస్తున్న వర్షాలు రైతుల్లో ఆనందం

విశాలాంధ్ర - జలుమూరు : మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా సారవకోట మండల పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రైతులు ఆనందపడ్డారు. వరిచేలు ఎదలు వేసే రైతులు నీరు లేకుండా బాధ పడుతున్న సమయానికి వరుణ్ దేవుడు కరుణ కురిపించడంతో మంగళవారం సాయంత్రం నుండి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో చాలా పొలాలకు నీరు చేరడం రైతుల ఆనందం కనిపిస్తుంది. చేరిన నీరుతో మరో రెండు రోజుల్లో ఎరువులు గిరాకీ పెరుగు తుందని రైతులు అంటున్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని డి.గొనపపుట్టుగ పంచా యతీలో గల వడ్డీ జల్లుపుట్టుగ గ్రామానికి చెందిన నిరంజన్ సాహు గత కొన్ని రోజుల క్రితం యాక్సిడెంట్ అయ్యింది. ఈ విషయం గ్రామ యువత ద్వారా హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు ప్రమాద బాధితుడు నిరంజన్ సాహు కు పరామర్శించి తక్షణ సహాయంగా పది వేల రూపాయలు అందజేశారు. ఈ సంద ర్భంగా నిరంజన్ సాహూకు ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్క దాతకు కృతజ్ఞతలు తెలియ జేశారు. మరిన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకొచ్చి నిరంజన్ సాహుకు ఆర్థికంగా ఆదు కోవాలని హనుమాన్ హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎన్ఎస్ఎస్ పీవోలతో సమావేశం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ పీవోలతో బుధవారం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, వర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. అనూరాధ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లోని ప్రజల సమస్యలను తన దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి పరిష్కారం చూపుతానని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. నగరం లోని కలెక్టరేట్ లోని జెసి చాంబర్ లో ఎస్సీ, ఎస్టీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఆయనను కలుసుకొని దుశ్శాలువాతో సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ నెలలో చివరి శనివారం ఎస్టి, ఎస్సీ సమస్యలపై సమావేశం నిర్వహిస్తున్నామని మీరు ఏమైనా సమస్యలు గుర్తిస్తే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు గంజి ఆర్ ఎజ్రా మాట్లాడుతూ జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా పని చేసిన వాళ్లు ఉన్నత స్థితిలో ఉన్నారని, మీరు కూడా భవిష్యత్తులో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. జెసిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు పిన్నింటి అప్పన్న, సందేశ్, నారాయణమూర్తి, తిర్లంగి రామకృష్ణ, ఆకుల కృష్ణ, బలగ మోహన్, రాయి రాము, బమ్మిడి వేణుగోపాల్, కిరణ్ కుమార్,జోషఫ్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛను పథకంపై అవగాహన కలిగివుండాలి

విశాలాంధ్ర - టెక్కలి : వితంతువులు వారి కోసం రూపొందించబడిన వితంతు పింఛను పథకం పై అవగాహన కలిగివుండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్ హెచ్ ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన వితంతు పింఛనుదారులు, వితంతు పింఛన్ కి అర్హులైన వారితో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వితంతు పింఛన్ పొందడానికి గల అర్హతులు, ఏ రకంగా దరఖాస్తు చేసుకోవాలి, ఎటువంటి పత్రాలు సమర్పించాలి తదితర విషయాలపై వితంతువులకు అవగాహన కలిగించారు. అలాగే వితంతు పింఛనుకి అర్హత ఉండి పింఛను అందకపోతే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల పరిషత్ అధికారిని కె విజయలక్ష్మి, ఎఒ హెచ్వి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేస్తాను : ఎంపీపీ బైరేగినాయుడు

విశాలాంధ్ర - పోలాకి : ఎంతో ప్రాముఖ్యత కలిగిన పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పోలాకి మండల పరిషత్ ముఖ్య సలహాదారులు ముద్దాడ బైరేగి నాయుడు అన్నారు. మంగళవారం ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనాథ్ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. వైద్యశాల ఎంతగానో అభివృద్ధి చెందినట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో సేవలందించిన వైద్యులులకు సిబ్బందికి అభినందనలు తెలిపారు. తన పదవీకాలంలో తన వంతుగా అభివృద్ధి కొరకు సమావేశ మందిరంని నిర్మించుటకు నిధులు విడుదల చేయుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉషశ్రీ మాట్లాడుతూ వివిధ జాతీయ కార్యక్రమాలు అమలుపరిచి సఫలీకృతం చేయుటలో సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అభివృద్ధి కమిటీ సమావేశంలో 12 అంశములు సభ ముందు తీర్మానం చేయగా ఏకగ్రీవంగా ఆమోదించారు. పోలాకి ప్రథమ పౌరులు మజ్జి రమణమ్మ మాట్లాడుతూ మరింత అంకితభావంతో సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు సుమప్రియ పోలాకి పంచాయతీ ముఖ్య సలహాదారులు మజ్జి లక్ష్మీనారాయణ డాక్టర్ నల్లి రవికుమార్ పిఎమ్ఓ ఓఎస్ సాంబశివరావు హెచ్ వి బరాటం లక్ష్మి సీనియర్ అసిస్టెంట్ చంద్రమౌళి అప్పారావు వివిధ గ్రామాల ఆశ వర్కర్లు సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

నర్తు నివాసానికి శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని కొత్త పుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావు నివాసానికి శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మర్యాద పూర్వకంగా వచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్సి నర్తు రామారావు తోపాటు నియోజకవర్గం లో గల నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు, మున్సిపల్ చైర్పర్సన్, మున్సిపల్ వైస్ చైర్మన్, నాలుగు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు అంపురం జంక్షన్ వద్ద కు చేరుకొని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ నర్తు రామారావు స్వగృహంలో చైర్మన్, ఎమ్మెల్సీ, వైసిపి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెంపు

విశాలాంధ్ర - కవిటి : తల్లిపాలతోనే బిడ్డకు రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని ఎంపీటీసీ ప్రతినిధి సంతోష్ పట్నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలో గల బెలగాం పంచాయతీ జాడుపూడి ఆర్ఎస్ అంగన్వాడి కేంద్రం, బల్లిపుట్టుగ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు కార్యక్రమం చేపట్టారు.

సమాజానికి సాంకేతిక విజ్ఞానాన్ని అందించాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : సమాజ హితానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరిచయ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గత శతాబ్ది కాలంలో ఎన్నో నూతన, ప్రయోజనకర ఆవిష్కరణలకు వేదిక అయ్యిందన్నారు. ఎలక్ట్రికల్, ఆటోమొబైల్, ఎయిర్క్రాఫ్ట్, టెలికాం, ఆగ్రో, మెకానిజమ్, టెలివిజన్, వాటర్ సప్లై నానో టెక్నాలజీ తదితర రంగాల్లో 8 మిలియన్ల ఇంజనీర్లు 24.1 మిలియన్ల ఉత్పత్తులకు ఈ సమాజానికి అందిం చారన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ జడ్జి (నెల్లూరు), బీఆర్ యూ అంబుడ్స్మెన్ పర్సన్ జస్టిస్ జి.వెంకట క్రిష్ణయ్య మాట్లాడుతూ సమాజంతో, ప్రకృతిలో స్నేహపూర్వకంగా మెలిగే ఎంచుకున్న వృత్తిలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. బీఆర్ఎయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ ప్రముఖ జీవిత చరిత్రలను చదవడంతో స్ఫూర్తి పొందవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. సుజాత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. రాజశేఖరరావు, ఓఎస్ డాక్టర్ యు. కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ రహిత డ్రైవింగ్, సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఇతర పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు మైనర్, డ్రైవింగ్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాలను శ్రీకాకుళం జిల్లాలో పోలీస్ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోజురోజుకీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ప్రతి ఒక్కరు అవగాహణ కలిగి ఉండాలన్నారు. లైసెన్సులు లేని డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్ వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి అని వీటి యెడల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. సైబర్ నేరాలపై మీకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే 1930 ఫోన్ నెంబర్ కు మరియు ఇతర నేరాలకు 100 నెంబర్ కు ఫోన్ చేసినట్లయితే సంబధిత పోలీసులు తక్షణమే స్పందిస్తారని తెలిపారు. ప్రతి దినమున ఫోన్ యాప్ లో రకరకాల ఫేక్ మెసేజెస్, రివార్డ్స్ ఫ్రీ రీఛార్జ్ అని లాటరీ విన్నర్స్ వస్తుంటాయని వాటికి ఫోన్ యజమానులు స్పందించినట్లయితే వారి అకౌంటు అన్ని కూడా ఖాళీ అయిపోతాయని అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. చదువుకున్న వయసులో మాదక ద్రవ్యాలకు బానిసలు అవ్వడం వలన కలిగే అనర్థాలు కలుగుతాయి కాబట్టి అటువంటి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు, కలశాల సిబ్బంది, పోలిసు సిబ్బంది పాల్గొన్నారు.